సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

C/O పందుంపుల్లల సందు

సామాన్యుల వ్యాపార కేంద్రం - ఎందరికో జీవనాధారం

పందుంపుల్లల సందు.. మహా విశాఖ నగరంలో ఈ పేరు తెలియని వారుండరు. పూర్ణా మార్కెట్ వెనుక ఉన్న ఈ సందులోకి గతంలో కూరగాయలను వాహనాల్లో తీసుకొచ్చేవారట. రాత్రి సమయంలో వాహనాలతో వచ్చిన వారు తెల్లవారు మూడు గంటల నుంచి క్రయవిక్రయాలు చేసుకునే వారిని చెప్పుకుంటారు. ఈలోపు రాత్రంతా వాహనాల్లో వచ్చిన వారందరూ అక్కడి పూర్ణా థియేటర్‌కు సినిమాకు వెళ్లి.. ఉదయాన్నే పక్కనే ఉన్న సందులో అమ్మే పందుంపుల్లలు కొని మొహం కడుక్కునే వారట. ఇలా ఈ సందుకు పందుంపుల్లల సందు అని పేరు వచ్చింది. కాలక్రమేణా ఇక్కడ వస్త్ర, కిరాణా, పండ్ల వ్యాపారాలు జరుగుతున్నా.. ప్రతి ఆదివారం ఇక్కడికి ఆనందపురం నుంచి ఓ వృద్ధుడు పందుంపుల్లలు తీసుకొచ్చి విక్రయిస్తుంటాడు.



పందుంపల్లల సందులో వస్త్ర దుకాణాలు

- అతి తక్కువ ధరకు వస్త్రాలు లభ్యం
- కిరాణా, ఫ్రూట్స్ కారుచౌకగా దొరికేది ఇక్కడే
- నగర మహిళలు మెచ్చే చోటు
- నిత్యం జనంతో కిటకిటలాడే ప్రాంతం



కిరాణా సామగ్రి, పచారీ దుకాణాలు

జగదాంబ: ఎంతో మంది వ్యాపారులకు పందుంపుల్లల సందు జీవనాధారం. నగర జనాభాలో 75 శాతం మంది ప్రజలు పందుంపుల్లల సందుపైనే ఆధారపడుతుంటారు. చిన్న పిల్లల పుట్టినరోజుల నుంచి ఏ పండగ వచ్చినా.. ఇక్కడికే వచ్చి కొత్త దుస్తులు కొనుగోలు చేస్తుంటారు. వాస్తవంగా చెప్పుకోవాలంటే ఈ పందుంపుల్లల సందు లేకపోతే నగరంలోని సగానికి పైగా జనాభాకు దుస్తులు లేనట్టే. జగదాంబ నుంచి వన్ టౌన్ వరకు, పోలీస్ బ్యారెక్స్ వద్ద అనే వస్త్ర దుకాణాలు ఉన్నా.. పందుంపుల్లల సందులోకి ప్రత్యేకంగా కొనుగోలుకు వస్తుంటారు. సీఎంఆర్, రిలియన్స్, వైజాగ్ సెంట్రల్ వంటి అనేక పెద్ద పెద్ద షోరూంలు ఉన్నప్పటికీ.. పేద, మధ్యతరగతి ప్రజలు ఈ వస్త్ర దుకాణాలను ఓ వరంగా భావిస్తారు. అందుకే నగరం నలుమూలల నుంచే కాకుండా శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి ఇక్కడికే జనం వచ్చి కొనుగోలు చేస్తుంటారు.

అన్నీ అక్కడే..

పందుంపుల్లల సందుకు వస్తే చాలు.. ఇక ఎక్కడికీ వెళ్లనవసరం లేదు. అక్కడే పచారీ దుకాణాలు, పోపులు సామన్లు, పండ్లు, పూజా సామగ్రికి కావాల్సిన అన్ని సరకులు దొరుకుతుంటాయి. అందుకే ఏ పండగ వచ్చినా పందుంపుల్లల సందు ఇసకేస్తే రాలనంతగా మహిళలతో నిండిపోతుంది. ఒక్కసారి ఈ సందులోకి వస్తే ఇంటిలాపాదికి కావాల్సిన అన్ని సరకులతో బయటకు రావచ్చు అనేది ఇక్కడ పాతగనరంలో నానుడి.



పందుంపుల్లల సందులో పందుంపుల్లలు అమ్ముతున్న ఓ వృద్ధుడు

తక్కువ ధరలకు దొరుకుతాయి



పేదల షాపింగ్ సెంటర్ పందుంపుల్లల సందు. మంచి దుస్తులు తక్కువ ధరకు లభిస్తాయి. పిల్లల నుంచి పెద్దల వరకు దుస్తులు, చీరలు అన్ని రంగుల్లో, అన్ని ధరల్లో లభిస్తాయి. పేదలకు ఫ్యాషన్ అంటే ఇక్కడే దొరుకుతాయి. అందుకే పందుంపుల్లల సందుకు వస్తాం. –సత్యవెంటలక్ష్మి, పండా వీధి

చిన్నప్పటి నుంచి ఇక్కడే..



మా తల్లిదండ్రులు, తరువాత మేము ఇలా అందరం ఏం పండగైనా పందుంపుల్లల సందుకే వస్తాం. ఇక్కడైతేనే అనుకున్న ధరల్లో దుస్తులు కొనుగోలు చేసుకోవచ్చు. షోరూమ్స్‌కు వెళ్తే అక్కడ ఎంత చెబితే అంతే చెల్లించాలి. ఇక్కడ భేరమాడి మాకు నచ్చినవి కొనుక్కుంటాం. – రాజేశ్వరి, జాలరిపేట

క్లుప్తంగా

జోన్-4 ఇన్‌చార్జి ఏఎంహెచ్‌వోగా కృష్ణంరాజు



జగదాంబ: జీవీఎంసీ జోన్-4 ఇన్‌చార్జి ఏఎంహెచ్‌వోగా జనుమూరి కృష్ణంరాజు నియమితుడయ్యారు. గత ఏఎంహెచ్‌వో రాజేష్ డిప్యూటేషన్ పూర్తి కావడంతో ఆయనను సొంత శాఖకు ప్రభుత్వం సరెండర్ చేసింది. జోన్-8లో విధులు నిర్వహిస్తున్న కృష్ణంరాజుకు ఇక్కడ అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు పబ్లిక్ హెల్త్‌లో సమస్యల పరిష్కారానికి సిబ్బందితో కలిసి పనిచేస్తానన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనతో పర్యావరణ సమతుల్యతను కాపాడుదామని పిలుపునిచ్చారు.

వసతి గృహంలో వృద్ధుడికి ఆశ్రయం



నిరాశ్రయ వసతి గృహంలో అప్పారావును చేర్పిస్తున్న పట్టా రమేష్‌బాబు

డాబాగార్డెన్స్: దిక్కు లేని వారికి చేయూతనిస్తూ పట్టా ఫౌండేషన్ మానవత్వాన్ని చాటుకుంటోంది. అనకాపల్లి జిల్లా వేల్పుల వీధికి చెందిన వాసది అప్పారావు అనే వృద్ధుడిని కుటుంబ సభ్యులు వదిలేశారు. దీంతో అతడు నిరాశ్రయుడయ్యాడు. కొంత కాలంగా పెదవాల్తేర్ ఎస్పీ కార్యాలయం ఎదురుగా గల ఓ హోటల్ వద్ద ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ..ఆకలితో అలమటిస్తూ..చివరకు భిక్షాటనకు కూడా ఇబ్బంది పడుతూ చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఆ పెద్దాయన పడుతున్న కష్టాలను పట్టా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టా రమేష్‌బాబు చూసి చలించిపోయారు. వృద్ధుడితో మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడితో ఆగకుండా పెదవాల్తేర్ దళయ్ వారి వీధిలోని రెడ్‌క్రాస్ సొసైటీ నిరాశ్రయుల వసతి గృహానికి వెళ్లి కేర్ మేనేజర్ మురళీని సంప్రదించారు. అనంతరం అప్పారావుకు వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. మానవతా దృక్పథంతో కుటుంబ సభ్యులు వచ్చి తీసుకెళ్లాలని అభ్యర్థించారు. పట్టా రమేష్‌బాబు చేసిన సేవలో పీతల తాతయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జోన్-4 కమిషనర్ బదిలీ



ప్రసాదరావు

జగదాంబ: జీవీఎంసీ జోన్-4 కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు బదిలీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో ఆయన బదిలీపై జోన్-4 కార్యాలయానికి కమిషనర్‌గా వచ్చారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సాధారణ బదిలీల్లో భాగంగా గురువారం రాత్రి ప్రసాదరావును శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై పంపుతున్నారు.

తాగునీరు వృథా



వెలంపేటలో లీక్ అవుతున్న తాగునీరు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు వెలంపేట వద్ద తాగునీరు సరఫరా ప్రధాన పైప్ లీక్ అవడంతో నీరు వృథాగా పోతోందని స్థానికులు చెబుతున్నారు. పాతనగరంలోని అన్ని ప్రాంతాలకు ఈ పైపు ద్వారానే తాగునీరు సరఫరా అవుతోందన్నారు. నాలుగు రోజులుగా ఈ పరిస్థితి ఉన్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో పాతనగరంలో తాగునీరు సరఫరా ఆగిపోయిందని మహిళలు చెబుతున్నారు. మరమ్మతుల పేరుతో ఆరు నెలలుగా వెలంపేట వద్ద పైప్‌లైను ఏర్పాటు కోసం తవ్వవదిలేయడంతోనే నీటి సరఫరా కావడం లేదని అంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టి పాతనగరానికి నీటి సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడలతో శారీరక ఆరోగ్యం



విద్యార్థినికి మెడల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, ఫిజికల్ డైరెక్టర్ కిరణ్మయి

డాబాగార్డెన్స్: మేజర్ ధ్యాన్ చంద్ జయంతి పురస్కరించుకొని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ప్రయోజనాలున్నాయని తెలిపారు. అనంతరం గత రెండేళ్లలో నేషనల్ యూనివర్సిటీ గేమ్స్‌లో పతకాలు సాధించిన కళాశాల విద్యార్థినులకు మెడల్స్ అందజేశారు. త్రోబాల్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త బి.సంతోషి, అనూష తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి ఉత్సవాలు



పిల్లలకు బహుమతులు అందిస్తున్న శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కృష్ణాష్టమి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. కోలాటంలో చక్కటి ప్రదర్శన ఇచ్చిన వివేకానంద సంస్థ ట్యూషన్ విద్యార్థులు, కృష్ణుడి వేషధారణలో నిలిచిన చిన్నారులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానంద సంస్థ విద్యనే గాక ఆధ్యాత్మికంగా నామ సంకీర్తనలు, సంప్రదాయ నృత్యాలు, ఆచార వ్యవహారాలను విద్యార్థులకు చక్కగా బోధించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై శ్రద్ధ చూపాలన్నారు. చివరగా ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పోలవరపు అప్పలకొండ, డి.వీర్రాజు, నల్లరాజు, సిహెచ్.ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి త్రికాల పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో సిరులతల్లి, విశేష హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

- 25వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు గురువారం 25వ రోజుకు చేరాయి. అమ్మవారికి విశేష పూజలు, త్రికాల పంచామృతాభిషేక సేవ, విశేష హోమాలు నిర్వహించారు. విశిష్ట శ్రావణలక్ష్మి పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పరోక్షంగా పూజలు చేయదలచుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081కు పూజా రుసుం జమచేసి వారి పేరు, గోత్ర నామం, చిరునామాను 89855 15989కు వాట్సాప్ చేయాలి. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేకం

కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరగనున్న ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించాలి. వివరాలకు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

చివరి శుక్రవారం పూజలు నేడు

ఈ నెల 5 నుంచి ప్రారంభమైన శ్రావణ మాస పూజలు వచ్చే నెల 3తో ముగియనున్నాయి. నాలుగో శుక్రవారం నిర్వహించనున్న విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలచే దంపతులు రూ.400 పూజా రుసుం చెల్లించాలి.

నిరుద్యోగ జేఏసీ వినతి

డాబాగార్డెన్స్: గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షా ఫలితాలు 1:100గా మళ్లీ విడుదల చేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ గురువారం విశాఖలో మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ వినతిని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోం మినిస్టర్ వంగలపూడి అనితకు కాపీ పంపినట్టు తెలిపారు. 2023 పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రశ్నాపత్రంలో అనేక తప్పులు దొర్లాయని, తక్షణమే 5 గ్రేస్ మార్కులు కానిస్టేబుల్ అభ్యర్థులకు, అదే పరీక్షకు హాజరైన హోంగార్డులకు 15 గ్రేస్ మార్కులు గత సచివాలయ అభ్యర్థులు మాదిరిగా వేసి తదుపరి పరీక్షలకు అనుమతించాలని కోరారు. పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో మిగిలిపోయిన ఉద్యోగాలకు పరీక్ష రాసి ఉన్న పోలీస్ పిల్లలకు 50 శాతం అవకాశం కలిపిస్తే నిత్యం సమాజ సేవలో ఉన్న పోలీసులను గుర్తించినట్టు అవుతుందని, మిగిలిన 50 శాతం అన్ని కులాల వారికి కేటాయించాలన్నారు. ఏయూలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు తక్షణమే చేపట్టాలని, ఏయూలో డైలీవేజ్ వర్కర్లుగా గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని హేమంత్ కోరారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సున్నపు వీధిలో పరిశీలిస్తున్న జోన్-4 కమిషనర్ ప్రసాదరావు

జగదాంబ: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మలేరియా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ప్రసాదరావు సూచించారు. బుధవారం రాత్రి నుంచి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పరిస్థితిని తెలుసుకునేందుకు గురువారం ఆయన జోన్ పరిధిలోని 12 వార్డుల్లో పర్యటించారు. వన్ టౌన్ ప్రాంతం సున్నపు వీధిలోని రహదారులు, కాలువలు, గెడ్డలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి జెడ్సీ ప్రసాదరావు పలు సూచనలిచ్చారు. వర్షాలు కురుస్తుండటంతో గెడ్డల్లో నీటి ప్రవాహానికి అడ్డులేకుండా శుభ్రం చేయాలన్నారు. వీధుల్లో కాలువలను శుభ్రపరిచి, దోమలు లార్వాలు లేకుండా చర్యలు తీసుకోవాలని శానిటరి ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశించారు. అనంతరం జెడ్సీ స్థానికులతో మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎక్కడ జ్వరాలు ప్రబలినా ఆ ప్రాంతంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మలేరియా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటిని పారబోయించాలని చెప్పారు. ఇన్‌చార్జి ఏఎంహెచ్‌వో జె.కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజార్ కిశోర్, వార్డు ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

అల్లిపురం: విద్యార్థులకు క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ అన్నారు. 33వ వార్డులోని మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి విద్యార్థులకు ప్రభుత్వాలు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయన్నారు. వాటిని చక్కగా ఉపయోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో గౌరవంగా మసలుకోవాలని సూచించారు. సీడీపీవో ఏఈపీడీవో జి.శ్రీలత, మానసిక కౌన్సిలర్ సిహెచ్.ఝాన్సీలక్ష్మి విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస కాకూడదని, వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు చదువుపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.వి.వి.ఎస్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సభలను జయప్రదం చేయండి



ప్రచారం చేస్తున్న ఏఐటీయూసీ నేత వామనమూర్తి

సీతమ్మధార: ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల్లో భాగంగా సెప్టెంబర్ 3న విశాఖలో జరిగే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికుల మీద భారం మోపే 21, 31 జీవోలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ద్వారకానగర్ బుధిల్ పార్కు హోటల్ జంక్షన్ వద్ద గురువారం ఆటోడ్రైవర్ల ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ నూతన మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి నిత్యావసరాల ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రవికృష్ణ, యు.శివాజీ, కె.దేవుడు, జి.మురళి, జె.ఎస్.మూర్తి, టి.రవి, జి.సతీష్, డి.దేవరాజు, ఈశ్వరరావు, రాజు, శ్రీను అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మైకేల్ జాక్సన్ పాటలకు నోటితో సంగీతం

నేడు కళాభారతిలో కార్యక్రమం



డీటీఎస్ రమేష్

డాబాగార్డెన్స్: అంతర్జాతీయంగా సంగీత ప్రియులను ఊర్రూతలూగించిన మైకేల్ జాక్సన్ జయంతిని పురస్కరించుకుని ఆయన పాటలకు మిమిక్రీ కళాకారుడు డీటీఎస్ రమేష్ తన నోటితో సంగీత ప్రదర్శన ఇవ్వనున్నారు. విశాఖలో ఇంగ్లిష్ వెస్టన్ నైట్‌గా చూపించబోతున్న ఈ కార్యక్రమంలో మైకేల్ జాక్సన్ 10 పాటలకు రమేష్ సంగీతాన్ని అందించనున్నారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంగీత ప్రియులు, మైకేల్ జాక్సన్ అభిమానులను రమేష్ కోరారు. నోటి ద్వారా సంగీత ధ్వని అనుకరణతో జరిగే ఈ ప్రక్రియకు తానిచ్చిన పలు ప్రదర్శనల్లో విశేష ఆదరణ దక్కిందన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం



పందిరి రాట కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు, మహిళలు

అల్లిపురం: శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్, జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో 19వ వార్షికోత్సవ వినాయక చవితి మహోత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవాలయం రోడ్డులో గురువారం జీకే ఫౌండేషన్ చైర్మన్ భీశెట్టి గోపికృష్ణ, అసోసియేషన్ సభ్యులు పందిరి రాటకు పూజలు నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు వినాయక పందిరి నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా గోపికృష్ణ మాట్లాడుతూ 18 ఏళ్లుగా వినూత్న రీతిలో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా వినూత్నంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



ప్రిన్సిపాల్ మంజులను సత్కరిస్తున్న మహిళా కళాశాల తెలుగు విభాగం, విద్యార్థులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలుగు భాష గొప్పతనం, భాష పరిరక్షణలో విద్యార్థుల పాత్రపై మాట్లాడారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్.వి.పద్మకుమారి తెలుగు భాషకు గిడుగు చేసిన సేవల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పాటల పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం కళాశాల తెలుగు విభాగం, విద్యార్థులు ప్రిన్సిపాల్ మంజులను ఘనంగా సత్కరించారు. తెలుగు అధ్యాపకురాలు బి.రాధమ్మ, కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త బి.సంతోషి అనూష, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

- శ్రీ కాశ్యప్ విద్యానికేతన్‌లో గురువారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి కరస్పాండెంట్ కె.శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు సామెతలు, కథలు, పద్యాలు, పాటలు, బుర్రకథల రూపంలో భాష ప్రాధాన్యం, విజ్ఞాన వినోదాత్మకంగా ప్రదర్శించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు కరస్పాండెంట్ బహుమతులు ప్రదానం చేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాస్



విన్యాస ప్రదర్శనలో ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులు



ఎంజీఎం హైస్కూల్‌లో గిడుగు రామమూర్తి, ధ్యాన్ చంద్‌కు నివాళులర్పిస్తున్న అతిథులు

గిడుగు, ధ్యాన్ చంద్‌లకు ఘన నివాళి

అల్లిపురం: డాబాగార్డెన్స్ ఎంజీఎం హైస్కూల్‌లో గురువారం తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ఆర్.వి.వి.ఎస్.నాగభూషణం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, చైర్మన్ అప్పలరాజు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ వినయ్ గాంధీ, సెక్రటరీ మణిమాల, మండల విద్యాశాఖాధికారి పుష్పరాగం గిడుగు రామమూర్తి పంతులు, హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఈటీ మాస్టర్ రవి, తెలుగు ఉపాధ్యాయుడు వీరేంద్ర రాంబాబులను ఘనంగా సత్కరించారు. తెలుగు వ్యాసరచన, పద్య పఠనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రోటరీ క్లబ్ సహకారంతో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గిడుగు రామమూర్తి, ధ్యాన్ చంద్ సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్తీ ఆహార విక్రేతలపై కఠిన చర్యలు అవసరం



మాట్లాడుతున్న వాసు

డాబాగార్డెన్స్: కల్తీ ఆహారం విక్రయించే వారి ఆస్తులు జప్తు చేసి క్యాన్సర్ ఆస్పత్రులకు అప్పగించేలా కొత్త చట్టం తీసుకురావాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు సూచించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్తీ ఆహార విక్రేతల వెన్నులో వణుకు పుట్టేలా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం బయటకు వచ్చి టీ తాగుదామంటే కల్తీ.. హోటల్లో భోజనం తిందామంటే కల్తీ.. రెస్టారెంట్‌లో రుచికరమైన ఆహారం తిందామంటే కల్తీ.. సాయంత్రం స్నాక్స్ తిందామంటే కల్తీ.. చివరికి నీరు తాగాలన్నా కూడా కల్తీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ కల్తీ మాఫియా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని, పట్టించుకోవాల్సిన ప్రభుత్వాలు కల్తీ ఆహార సమస్యలను అసలు సమస్యగానే గుర్తించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో కల్తీ ఆహారం తిని వేలాది మంది క్యాన్సర్ బారిన పడ్డారని, చికిత్స చేయించుకునే స్తోమత లేక ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే స్పందించి కల్తీ ఆహారంపై ఫుడ్‌సేఫ్టీ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించాలన్నారు. సమావేశంలో దేవర శంకర్, మజ్జి రవికుమార్, పసుమర్తి సంతోష్‌కుమార్, కోరాడ వేంకటేష్, బోలెం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ సౌత్
9010810033, 7075989701
Office mail : sakshiadvtvsp@gmail.com